సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 25 । జనవరి । 2023



వైభవంగా రథోత్సవం

ఊర్కొండపేటలోని అభయాంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

వివరాలు 8లో ▸



ఈ అన్నం తినలేం..

ఉడకని అన్నం.. రుచి లేని కూరలు తినలేమంటూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.8 /16.4

వాతావరణం

ఉదయం, రాత్రి సమయాల్లో చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

రేపటినుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని సింహగిరి కొత్తగంజ్‌లో వెలసిన శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం తృతీయ పుష్కర ప్రయుక్త 36వ బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి వచ్చేనెల 6 వరకు జరగనున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు గురువారం నుంచి 31వ తేదీ వరకు అర్చకుల చేత హోమం, మూల మంత్ర జపం, హోమం హోమం, 28న సాయంత్రం 4 గంటలకు పురవీధుల గుండా లక్ష్మీనృసింహస్వామి శోభాయాత్ర నిర్వహిస్తారు. వచ్చేనెల 1న సుదర్శన నారసింహ హోమం, 2న ధ్వజారోహణం, 3న ఎదుర్కోళ్ల ఉత్సవం, 4న స్వామివారి కల్యాణోత్సవం, 5న శ్రీస్వామివారి రథోత్సవం, 6న చక్రతీర్థం, సహస్ర కళశాభిషేకం తదితర పూజలు నిర్వహించనున్నారు.

కురుమూర్తిస్వామి హుండీ లెక్కింపు



చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి ఆలయంలో మంగళవారం హుండీని లెక్కించారు. అమావాస్య, శనివారాల సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు హుండీలో కానుకలుగా సమర్పించిన నగదును లెక్కించగా రూ.3,96,567 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, చైర్మన్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పూజారులు వెంటయ్య, వెంటేశ్వరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా రూ.8,496

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగకు గరిష్టంగా రూ.8,496, కనిష్టంగా రూ.5,629 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు రూ.2,239, కందులు గరిష్టంగా రూ.6,830, కనిష్టంగా రూ.6,359 లభించాయి.

కందుల ధర రూ.7,009

దేవరకద్ర మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందులు క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,009గా ఒకే ధర నమోదైంది.

నేడు ఉల్లిపాయల వేలం

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు.

దూకుడే మంత్రం..



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, చిత్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, జితేందర్‌రెడ్డి, విజయశాంతి, డీకే అరుణ, ఈటల రాజేందర్ తదితరులు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ భేటీలో నేతల దిశానిర్దేశం

- ఇదే ఆఖరి పోరాటమని ఉద్ఘాటన
- టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని హితబోధ
- సమావేశంలో ప్రధానంగా రాజకీయం, వ్యవసాయంపై తీర్మానాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ పాలమూరు/ మహబూబ్‌నగర్ న్యూటౌన్: పాలమూరు వేదికగా జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉత్సాహంగా సాగింది. రాష్ట్రంలో ఎన్నికలకు ఏ విధంగా ముందుకెళ్లాలి.. పార్టీ సంస్థాగత విషయాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేశారు. ఇందుల్లో ప్రధానంగా రాజకీయం, వ్యవసాయరంగాలపై రెండు తీర్మానాలు చేయగా.. టీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని నాయకులు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయం బీజేపీయేనని.. ఇదే ఆఖరి పోరాటంగా భావించి ప్రతి ఒక్క కార్యకర్త క్రియాశీలకంగా పనిచేయాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పార్టీ పతాకావిష్కరణ అనంతరం అధ్యక్షోపన్యాసంతో సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా మృతి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలకు సంతాపం తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రధానంగా రాజకీయం, వ్యవసాయ రంగాలపై రెండు తీర్మానాలు చేశారు. ఈనెల 16, 17వ తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల వివరాలను వెల్లడిస్తూ రాష్ట్రంలో ఎన్నికలకు ఏ విధంగా ముందుకెళ్లాలి.. పార్టీ సంస్థాగత విషయాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతలు దిశానిర్దేశం చేశారు. ఫిబ్రవరి 10 నుంచి 25 వరకు రాష్ట్రంలోని 9 వేల శక్తి కేంద్రాల్లో నిర్వహించనున్న స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లు, 27న నరేంద్ర మోదీ పాల్గొననున్న పరీక్ష పే చర్చ కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయంతో పాటు పార్లమెంటరీ ప్రవాసీ యోజన పురోగతిపై చర్చ జరిపారు. బీఆర్‌ఎస్‌కు దీటుగా దూకుడుగా వ్యవహరించాలని.. బెదిరింపులు, వారి ఆగడాలకు ఎవరూ భయపడొద్దని పిలుపునిచ్చారు.

- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్వీఎస్‌ఎస్ ప్రభాకర్ రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. దీనిపై మాజీ ఎంపీలు, జాతీయకార్యవర్గ సభ్యులు జితేందర్ రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్ మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి మద్దతు తెలిపారు. విస్తృత చర్చ అనంతరం అందరూ మద్దతు ప్రకటించారు. కేసీఆర్ సీఎం అయ్యాక రాష్ట్రంలో అవినీతి పెరిగిందంటూ తీర్మానంలో రాష్ట్ర కార్యవర్గం ఎండగట్టింది
- వ్యవసాయరంగానికి సంబంధించి తెలంగాణ రైతుగోసపై రూపొందించిన ముసాయిదా తీర్మానాన్ని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మనోహర్ రెడ్డి ప్రవేశపెట్టారు. తెలంగాణలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. బీజేపీ చేస్తున్న పోరాటాలను ప్రస్తావించారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మద్దతిస్తూ ప్రసంగించారు. 'అబ్ కీ బార్ ఆబ్కారీ సర్కార్ పరిస్థితి. నీళ్లు–నిధులు–నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చి వాటికి తిలోదకాలిచ్చారు.పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కట్టలేని కేసీఆర్ కమీషన్ల కోసం కక్కుర్తిపడి డిజైన్లు మార్చి అంచనాలు పెంచారు. మద్యం ద్వారా ప్రజల రక్తం తాగుతున్నారు. రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే 4వ స్థానంలో ఉంది.' అని ఆమె మండిపడ్డారు.
- పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి వట్టెం రిజర్వాయర్ నిర్మాణంలో వేల కోట్ల అవినీతి జరిగిందని.. ఆధారాలతో సహా బయటపెడతామని.. ఇందుకు పార్టీ మద్దతివ్వాలని దిలీపాచారి కోరారు.
- ఫార్మాసిటీకి సంబంధించి 19,300 ఎకరాల భూమి సేకరణ లక్ష్యం కాగా.. 13 వేల ఎకరాలు సేకరించారని.. రైతుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేశామని.. దీనిపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని బొక్క నర్సింహారెడ్డి విజ్ఞప్తి చేశారు.
- ప్రజా సమస్యలపై నాగర్‌కర్నూల్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు పాదయాత్ర చేసి ప్రజల్లోకి వెళ్లడాన్ని అభినందిస్తున్నా.. మనందరం ప్రజల బాధలను పంచుకోవాలి. ఆందోళనలను తీవ్రస్థాయిలో చేయాలని బండి సంజయ్ అనడంతో సమావేశంలో చప్పట్లు మోగాయి.

కేంద్రనిధులపై అసత్యాలు చెబుతున్న బీఆర్‌ఎస్

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసత్యాలు చెబుతోందని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇస్తుంటే బీఆర్‌ఎస్ విష ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. స్కాలర్‌షిప్ నిధులు నేరుగా విద్యార్థి అకౌంట్‌లో వేసేందుకు డిజిటల్ చేయాలని సంకల్పించి వివరాలు అడిగితే.. రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటూ స్కాలర్‌షిప్‌లు రాకుండా చేస్తోందన్నారు.సైన్స్ సిటీకి 25 ఎకరాలు ఇవ్వాలని కోరుతూ లేఖ రాస్తే బీజేపీకి పేరొస్తుందనే అక్కసుతో భూమి ఇవ్వడం లేదన్నారు. ప్రతి అభివృద్ధి పనిని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటూ కేంద్రంపై ఆరోపణలు చేస్తూ బీఆర్‌ఎస్ రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని మంత్రి అన్నారు.



సమావేశానికి హాజరైన పదాధికారులు

మోదీతో దేశఖ్యాతి పెరుగుతోంది

జీ–20 సమావేశాలు గతంలో ఢిల్లీ వరకే పరిమితం అయ్యేవని, ప్రస్తుతం మోదీ దేశంలోని 56 ప్రధాన నగరాల్లో ఈ సమావేశాలు నిర్వహించబోతున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. ప్రపంచ జనాభాలో 60 శాతం ఉన్న 20 దేశాలకు ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం వహిస్తున్నారని, దేశ సంస్కృతి సంప్రదాయాలతో పాటు విలువలతో కూడిన దేశ సంపదను ప్రపంచం అర్థం చేసుకునేలా వ్యవహరిస్తూ నరేంద్రమోదీ భారత్‌ను ప్రపంచానికి దిక్సూచిగా తీర్చిదిద్దుతున్నారన్నారు. జీ–20 సందర్భంగా మహిళలను, అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేయబోతున్నామన్నారు. జీ–20 ప్రత్యేకతను చాటే చెప్పేలా తెలంగాణలో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక కళారూపాలను ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. స్వదేశీ టెక్నాలజీతో సత్తా చాటుతున్నామని, దీనిని మరింత అభివృద్ధి జరగనున్నట్లు సూచించారు. జీ–20 సదస్సుపై చైతన్యం కలిగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.

ధనిక రాష్ట్రాన్ని.. అప్పల పాల్జేశారు

రూ.14 వేల కోట్ల మిగులు బడ్జెట్ గల ధనిక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ చేతిలో పెడితే రూ.5.50లక్షల కోట్ల అప్పుల పాల్జేశారని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు జితేందర్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఆయన వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో కొన్ని నెలల వ్యవధిలో వచ్చే ఎన్నికలపై చర్చ జరిగిందని, ఇందులో పార్టీపరమైన కొన్ని నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కేసీఆర్ కుటుంబసభ్యులపై వస్తున్న ఆరోపణలపై చర్చించారని చెప్పారు. రాజకీయ తీర్మానాన్ని ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ముసాయిదా ప్రవేశపెడితే అందరూ మద్దతు తెలిపారన్నారు. ఈ నెల 16, 17న ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో మోదీ, అమిత్‌షా, జేపీ నడ్డా ప్రసంగించిన అంశాలపై, దేశంలోని 20 రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తున్న క్రమంలో అక్కడ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై చర్చ జరిగిందన్నారు. సరల్ యాప్ కొత్తగా శ్రీకారం చుట్టామని, సెల్ నం.78200 78200కు మిస్ కాల్ ఇస్తే కార్యకర్తల బయోడేటా వస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ తీర్మానాన్ని గరికపాటి రామ్మోహన్‌రావు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. పలు సంక్షేమ పథకాల అమలుపై మోదీకి కృతజ్ఞతలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టామన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసులను తీవ్రంగా మోసం చేస్తోందని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు అన్నారు. గిరిజనశాఖ మంత్రి ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం చేసింది ఏమి లేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పోడు భూముల వివరాలు, లెక్కలపై ఈ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.



నారాయణపేటలో బహిరంగ సభకు హాజరైన కార్యకర్తలు

పనిమంతులకే పట్టం కట్టండి..

- ఏ ముఖం పెట్టుకొని పాలమూరులో మోదీని పోటీ చేయమంటున్నారు
- ఎన్ని అడ్డంకులున్నా.. పాలమూరు–రంగారెడ్డి నిర్మించి తీరుతాం
- రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- నారాయణపేట జిల్లాలో రూ.196కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- సమీకృత కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు భూమిపూజ



మాట్లాడుతున్న కేటీఆర్

నారాయణపేట: సహచర మంత్రులు సైతం ఈర్ష్య పడేలా నారాయణపేట జిల్లా అభివృద్ధిలో ముందడుగు వేస్తోందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎంతో పట్టుబట్టి పేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పనులు మంజూరు చేయించుకుంటున్నారని చెప్పారు. పనిమంతులకు పట్టం కట్టి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎస్‌ఆర్‌రెడ్డితో పాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎమ్మెల్యేలందరినీ అసెంబ్లీకి పంపాలని ప్రజలను కోరారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రూ.196 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ డిజైన్ బాగుందని, మినీ ట్యాంక్‌బండ్ వద్ద పనులు చక్కగా ఉన్నాయని చెప్పారు. రహదారి లేని ప్రాంతాన్ని చక్కగా తయారుచేశారని, రాష్ట్రంలో ఎక్కడీ లేని విధంగా సీనియర్ సిటిజన్ పార్కు ఇక్కడ ప్రారంభించామని అన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీఎం కేసీఆర్‌తో పట్టుబట్టి అన్ని పనులు చేసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఏ మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాలు లేవని, మరికల్‌లోనూ ఇలాంటి ఇంటిగ్రేటెడ్ మండల కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇంతకు ముందు వచ్చినప్పుడు కొండారెడ్డిపల్లి చెరువుకు తోవ లేక వినాయక నిమజ్జనం చేసుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. రూ.4 కోట్ల వ్యయంతో నేడు ఆహ్లాదకరంగా మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణం పూర్తయ్యిందని అన్నారు. ధన్వాడకు డిగ్రీ కళాశాల, నారాయణపేటకు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల మంజూరు అయ్యాయన్నారు. రామాలయానికి రూ.10 కోట్లు, ఈద్గా నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.



కలెక్టరేట్ సమీకృత భవనానికి భూమిపూజ చేసి హారతి ఇస్తున్న మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, మహమూద్‌అలీ

నిజాయితీ నిరూపించుకుంటా..

తన నిజాయితీని ప్రజల ముందు నిరూపించుకుంటానని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. 'నారాయణపేట నియోజకవర్గంలో భూకబ్జాలను ప్రోత్సహించే వ్యక్తిని చూసి వ్యాపారస్తులు పారిపోతున్నారు. మరో వ్యక్తి ప్రవర్తనను చూసి ఆడోళ్లు పారిపోతున్నారు.' అంటూ బీజేపీ, కాంగ్రెస్ నేతలనుద్దేశిస్తూ ఎద్దేవా చేశారు. జిల్లాలో అభివృద్ధిపై ప్రశ్నించే వారికి, సీఎం కేసీఆర్ కంటివెలుగు కార్యక్రమంలో కళ్లద్దాలు ఇప్పిస్తానని, ఆ అద్దాలు పెట్టి చూయిస్తామని అన్నారు. ఆధునిక కూరగాయల, మాంసాహార మార్కెట్‌ను జిల్లాలో ప్రారంభోత్సవం చేసుకున్నామని, కోయిలకొండ రామప్పకొండలో రామాలయ నిర్మాణానికి రూ.10 కోట్లు అడిగిన వెంటనే మంత్రి మంజూరు చేశారని అన్నారు. జిల్లాలో తాగునీటి ట్యాంకులను రూ. 27 కోట్ల వ్యయంతో నిర్మించినట్లు తెలిపారు. 100 పడకల చిన్నపిల్లల ఆస్పత్రి , డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా రూ. 11 కోట్ల నిధులతో స్టేడియం గ్రౌండ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మహిళా సమాఖ్యలకు రూ.1.55 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును మంత్రి కేటీఆర్ చేతులమీదుగా మహిళా సంఘాల సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ వనజ, కలెక్టర్ శ్రీహర్ష, ఎమ్మెల్యేలు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి వాటా తేల్చండి..

పాలమూరు ఎండితే ప్రజలు కరువుతో కడుపు మండి బీఆర్‌ఎస్‌పై తిరుగుబాటు చేయించేందుకేనా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డు వేస్తోందని.. ఏ ముఖం పెట్టుకొని పాలమూరులో నరేంద్రమోదీని పోటీ చేయాలని బీజేపీ నేతలు కోరుతున్నారని మంత్రి కేటీఆర్ విమర్శించారు. కృష్ణానదిలో తెలంగాణకు రావాల్సిన నీటి వాటా తేల్చేందుకు కూడా తాత్సారం చేస్తున్నందుకు ఓటు వేయాలా మీకు అంటూ ఎద్దేవా చేశారు. తొమ్మిదేళ్లు గడుస్తున్నా నీటి పంచాయితీ ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఉమ్మడి పాలమూరులో 11 లక్షల ఎకరాలకు నీరందిస్తున్నామని చెప్పారు. ఎవరు అడ్డుకున్నా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మించి తీరుతామని తేల్చిచెప్పారు.

వనాల బాధ్యత కార్యదర్శులదే..



మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూరు పల్లె ప్రకృతి వనం

- పల్లె ప్రకృతి వనాల సంరక్షణకు కొత్త నిబంధనలు
- పీపీపీ యాప్‌ను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశాలు
- జిల్లాలో మొత్తం 441 పల్లె ప్రకృతి వనాలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపే లక్ష్యంగా ప్రతి పంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల పీపీపీ నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వం ఇటీవల కొత్త నిబంధనలు అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఇక నుంచి పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలు కార్యదర్శులే చూసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలో 441 గ్రామ పంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామాల్లోనూ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో 4 వేల మొక్కలు, 0.75 ఎకరాల విస్తీర్ణంలో 3 వేల మొక్కలు, 0.50 ఎకరాల విస్తీర్ణంలో 2 వేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 8.74 లక్షల మొక్కలు నాటారు. దీంతోపాటు బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. జిల్లాలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. వీటిని 5 నుంచి 10 ఎకరాల విస్తీర్ణంలో 15 వేల నుంచి 31 వేల మొక్కలు పెంచడానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

అందుబాటులోకి కొత్త యాప్..

పల్లె ప్రకృతి వనం (పీపీవీ) వివరాలను రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఐదు రకాల ఫొటోలు తీసి ఈ ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలి. ఇక నుంచి పంచాయతీ కార్యదర్శులే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి పనులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..

జాతీయ ఉపాధి హామీ పథకంలోని నిబంధనల ప్రకారం ఇప్పటి వరకు పల్లె ప్రకృతి వనాలను గ్రామ పంచాయతీలు నిర్వహించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి వాటి నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులే చూసుకోవాలి. ఉపాధి నిధులతో పల్లె ప్రకృతి రూపేణ శాశ్వత ఆస్తిని పంచాయతీలకు అప్పగించాం. – యాదయ్య, డీఆర్‌డీఓ

బాలికలు ప్రలోభాలకు గురికావొద్దు

- కలెక్టర్ వెంకట్రావ్
- ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): యుక్త వయసులో అమ్మాయిలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు జాగ్రత్త తీసుకోవాలని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. బాలికలు, మహిళలను మోసం చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, చట్టాలను సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలకు కోసం ప్రతి మండలంలో అన్ని వసతులతో కూడిన కేజీబీవీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా ప్రతి బాలికను పాఠశాల, కళాశాలలో వైద్య పరీక్షలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బాలికలు, మహిళల భద్రతలో భాగంగా పోలీస్ శాఖ షీటీం పనిచేస్తుందని, దీని ద్వారా మహిళలపై వేధింపులు లేకుండా చూస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ బాలిక సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి జరీనాబేగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ నయీముద్దీన్, డీవైఎస్ఓ శ్రీనివాసులు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నటరాజ్, జీసీడీఓ పల్లవి, ఎన్‌సీడీపీఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

జిల్లాకేంద్రంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకట్రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పాలకొండ సమీపంలోని నూతన కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ గ్రౌండ్ వరకు బైక్ ర్యాలీ చేపడుతామన్నారు. అనంతరం జెడ్పీ సమావేశ మందిరంలో ఒంటిగంటకు ఎన్నికల సంఘం రూపొందించిన మైన్ భారత్ హూన్ అనే పాట వినిపిస్తారని, 1.10 గంటలకు ప్రతిజ్ఞ, అనంతరం ఓటర్లు అయిన సీనియర్ సిటిజన్లకు సన్మానం ఉంటుందన్నారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో గ్రూప్–1, 2, 3, 4 ఉద్యోగాలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. గతంలో శిక్షణ తీసుకున్న వారు అనర్హులని, పూర్తి సమాచారం కోసం సెల్ నం .98859 29862ను సంప్రదించాలని కోరారు.

8,431 మందికి కంటి పరీక్షలు



టీడీగుట్టలోని కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ తేజాస్ నందులాల్ పవార్

పాలమూరు/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో కంటివెలుగు పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం మొత్తం 45 ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు చేపట్టి అంధత్వ సమస్యలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీడీగుట్ట వద్ద వైద్య శిబిరాన్ని అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మోతినగర్‌లోని కేంద్రాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ పరిశీలించారు. అదేవిధంగా జానంపేటలోని కంటి వెలుగు పరీక్ష కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ కృష్ణ తనిఖీ చేశారు. మొత్తంగా 45 బృందాల ద్వారా 8,431 మందికి కంటి పరీక్షలు చేసి 1,205 మందికి రీడింగ్ అద్దాలు అందజేయగా.. 712 మందికి దూరచూపు సమస్య ఉన్న అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు. ఇప్పటి వరకు జిల్లాలో 31,354 మందికి కంటి పరీక్షలు చేయగా.. 6,188 మందికి అద్దాలు ఇచ్చి.. 3,872 మందికి అద్దాల కోసం ఆర్డర్ పెట్టారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

చారకొండ: మండల పరిధిలోని చంద్రాయన్‌పల్లిలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజమున చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరం కళ్యాణ్ రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రాయన్‌పల్లికి చెందిన డెరంగుల నర్సింహ(58) గ్రామంలో ఇతరుల పొలం కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. మంగళవారం తెల్లవారుజామున వేరుశనగకు నీరు పెట్టేందుకు బోరు మోటారు వద్దకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కుమారులు, ముగ్గురు కూమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

హోంగార్డు మృతిపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని జ్ఞానసరస్వతి దేవాలయం సమీపంలో హోంగార్డు పర్వత స్వామి(40) పురుగు మందు తాగి సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన విధితమే. హోంగార్డు మృతి సంఘటనకు సంబంధించి మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. హోంగార్డు పర్వత స్వామి మృతిపై అనుమానాలు ఉన్నట్లు భార్య మల్లీశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పదస్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్

- యువకుడికి తీవ్రగాయాలు: పరిస్థితి విషమం

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్ సమీపంలో సోమవారం రాత్రి బైక్‌ను గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో పెనిమిళ్లకు చెందిన వెంకటేష్ గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. తలకు, ఛాతిపైన తీవ్ర గాయాలు కావడంతో అతడిని వెంటనే అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం వెల్దండ గేట్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్సలు చేయిస్తున్నారు. డిండిలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న వెంకటేష్ గౌడ్ మరొక యువకుడు తిర్పతయ్యతో కలిసి వెల్టూర్‌లో జరిగిన ఓ విందులో పాల్గొని తిరిగి పెనిమిళ్లకు వెళ్తున్నాడు. రంగారెడ్డి తోట సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని ట్రాక్టర్ బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడిన తిర్పతయ్య విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రేకుల ఇల్లు దగ్ధం

అచ్చంపేట రూరల్: మండల పరిధిలోని మన్నెవారిపల్లిలో మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రేకుల ఇల్లు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన నీల లక్ష్మమ్మకు ఉన్న రేకుల ఇల్లులో ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో విద్యుదాఘాతంతో ఇంటిలోని టీవీ, దుస్తులు, బీరువాలోని విలువైన పత్రాలు, డబ్బులు కాలి బూడిదయ్యాయి. సుమారుగా రూ.1.50లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితురాలు తెలిపారు. బాధితురాలికి ఆదుకోవాలని స్థానికులు గురునాయక్, రాహుల్‌రెడ్డి తదితరులు కోరారు.

ముద్ర రుణమంటూ రూ.94 వేలు టోపీ

జడ్చర్ల: ముద్ర రుణం ఇస్తామని చెప్పి ఓ ప్రైవేటు మహిళా ఉద్యోగి నుంచి రూ.94 వేలు ఖాజేసిన ఘటన పట్టణంలో మంగళవారం వెలుగు చూసింది. సీఐ రమేష్‌బాబు కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఉషారాణి గూగుల్ యాప్‌లో సెర్చ్ చేసి ముద్ర యోజన రుణం కోసం నవంబర్ 28న దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తులో ఉద్యోగం, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేసింది. మరుసటి రోజు రెండు వేర్వేరు నంబర్ల నుంచి వచ్చిన ఫోన్లలో తాము ముద్ర యోజన నుంచి మాట్లాడుతున్నామని.. అప్లికేషన్ ప్రాసెస్ చేసేందుకు డబ్బులు వేయాలని కోరారు. వారు చెప్పిన సెల్‌నంబర్ 7838599165కు అడిగినట్లుగా ఫోన్‌పే నుంచి రూ.90,344 పంపించింది. రుణం వస్తుందేమోనని కొన్నిరోజులు వేచి చూసి చివరకు మోసపోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. సైబర్ నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు వివరించారు.

రామన్‌పాడుకు 1,890 క్యూసెక్కులు

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 1,440 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 450 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. దీంతో ఎన్టీఆర్ కాల్వ ద్వారా 950 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

నిజరూప దర్శనానికి ఏర్పాట్లు



సమావేశంలో పాల్గొన్న ఈవో పురేందర్‌కుమార్, అర్చకులు, ఆలయ సిబ్బంది

- బ్రహ్మోత్సవాలు ముగిసేదాక శక్తివంచన లేకుండా పనిచేద్దాం
- అలంపూర్ ఆలయాల ఈవో పురేందర్‌కుమార్

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుందని.. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఆలయ అర్చకులు, సిబ్బందితో అత్యవసర సమావేశం నిర్వహించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం ఎస్‌ఐ శ్రీహరితో కలిసి ఆలయంలోని క్యూలైన్లను పరిశీలించారు. జోగుళాంబ జాతర పేరిట కళషాలు తీసుకొచ్చే భక్తులకు ఒక లైన్, ప్రముఖులు, సామాన్య భక్తులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్కడెక్కడ పోలీసు బందోబస్తు అవసరమో వారికి వివరించారు. ఇదిలా ఉండగా ఆలయాన్ని దర్శించుకున్న ఆధ్యాత్మిక గురువు భానుమతికి ఈవో, ధర్మకర్త ఉషాదేవి, ఆలయ ముఖ్య అర్చకుడు ఆనంద్‌శర్మ వసంత పంచమికి ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికతో పాటు అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. సాయంత్రం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అభిషేక్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకొని అన్నదాన సత్రంలో భోజనం చేశారు.



ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి అభిషేక్‌రెడ్డి దంపతులు

లడ్డూ తయారీ కేంద్రం తనిఖీ..

బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కోసం తయారు చేసే లడ్డూ ప్రసాద కేంద్రాన్ని ఈవో పురేందర్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. భక్తులసంఖ్యకు సరిపడా లడ్డూలు తయారు చేయాలని సూచించారు. నాణ్యతలో రాజీ పడొద్దని.. ప్రసాదానికి మంచి పేరు తీసుకొరావాలని, రుచిలో ఎలాంటి మార్పులు ఉండరాదన్నారు

జోగుళాంబ జాతరను విజయవంతం చేద్దాం..

ఈ నెల 26న జరిగే జోగుళాంబ జాతరను విజయవంతం చేద్దామని జోగుళాంబ సేవాసమితి అధ్యక్షుడు బండి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం టూరిజం హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరను ఎప్పటిలాగే గంటలేశ్వర ఆలయం నుంచి ప్రారంభిస్తామని.. పట్టణ. గ్రామ ప్రజలందరూ కళషాలతో ఊరేగింపులో పాల్గొనాలని కోరారు. ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు మాట్లాడుతూ.. జోగుళాంబ ఆలయ ఆస్తుల పరిరక్షణతో ప్రారంభమైన సేవాసమితి నేడు అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తుల్లో చైతన్యాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. సేవాసమితి ముఖ్య నాయకుడు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జితేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. జాతరకు రూ.లక్షలు సేవాసమితి సొంతంగా ఖర్చు చేస్తోందని.. దేవస్థానం భరించాలని సూచించారు. ప్రచార కార్యదర్శి సంజీవనాయుడు, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌శర్మ మాట్లాడారు. అతి త్వరలోనే సేవాసమితి తరపున అదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు జోగుళాంబ ఆలయ శకటంతో ప్రచార రథయాత్రకు శ్రీకారం చుడదామని పిలుపునిచ్చారు. సమావేశంలో సభ్యులు సంజీవనాయుడు, వెంకటేష్, నారాయణ, సుంకన్ననాయుడు, బుజ్జి, ప్రశాంత్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజుకు బ్రహ్మోత్సవాలు..

ఆలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం మూడోరోజుకు చేరుకున్నాయి. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి అమ్మ, స్వామివార్లను దర్శించుకొని ఆలయంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ప్రారంభమైన అంజన్న బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

ధరూరు: మండలంలోని పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10 నుంచి 12 వరకు ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం, అంకురార్పణ తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల నడుమ అర్చకులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ఈఓ కవిత, ఆలయ అర్చకులు మద్వాచార్యులు, కిష్టాచార్యులు, పెద్ద చింతరేవుల, భీంపురం గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయుడి రథోత్సవం



రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు



పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, జడ్చర్ల, కల్వకుర్తి ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, జైపాల్‌యాదవ్ రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముందుకు లాగారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. ఆ సమయంలో ఆలయ ప్రాంగణం శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేసిన సీసీ రోడ్డు, టాయిలెట్స్‌ను ఎమ్మెల్యేలు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు గోళి శ్రీనివాస్ రెడ్డి, ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ రాధ, వైస్ ఎంపీపీ అనిల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలెంలో ప్రత్యేక ప్రసాద వితరణ

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో సంతానం లేనివారికి మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేకంగా స్వామి వారి ప్రసాద వితరణ చేశారు. ఉదయం అలివేలుమంగ సమేత వేంకటేశ్వస్వామివారి ఆలయంలో నిత్యారాధన, హోమ బలిహరణ, ధ్వజారోహణ పూజలు ప్రముఖంగా నిర్వహించారు. అనంతరం గరుడ పొంగళి నివేదన, ప్రభంద పారాయణం కార్యక్రమాలు చేపట్టి సంతానం లేని వారికి ప్రత్యేకంగా ప్రసాదాలు అందజేశారు. రాత్రి హోమం, బలిహరణ, భేరిపూజలు, హనుమంత వాహనసేవ, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. రెండోరోజు బ్రహ్మోత్సవాల కోసం ఆయా గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.



హనుమంత వాహన సేవలో స్వామివార్లు

జాతరకు వెళ్లడానికి డబ్బులివ్వలేదని..

విద్యార్థి బలవన్మరణం

బల్మూర్: జాతరకు పోవడానికి తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఓ విద్యార్థి ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని జిన్‌కుంటలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోరెంట్ల ఆంజనేయులు, సైదమ్మ దంపతుల కుమారుడు శివ(14) తెలకపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. నిత్యం బస్సులో పాఠశాలకు వెళ్లివస్తుండేవాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలోని తన స్నేహితులతో కలిసి జాతరకు వెళ్లడానికి తల్లిదండ్రులను డబ్బులు అడగగా.. వేరుశనగ పంటకు మందు పిచికారీ చేయాలని చెప్పి జాతరకు వెళ్లేందుకు డబ్బులు ఇవ్వలేదని తెలిసింది. దీంతో మనస్తాపానికి గురైన శివ ఇంటి సమీపంలోనే ఉన్న మామిడి తోటలోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండానే విద్యార్థి మృతదేహాన్ని ఖననం చేశారు.



శివ (ఫైల్)

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కేటీదొడ్డి: రాయచూర్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని కేటీదొడ్డి పోలీసులు పట్టుకున్నట్లు మంగళవారం ఎస్‌ఐ వెంకటేష్ తెలియజేశారు. కేటీదొడ్డికి చెందిన దేవరాజు, డ్రైవర్ వీరేష్ వివిధ గ్రామాల నుంచి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సేకరించి, రాయచూర్‌కు బొలెరొ వాహనంలో తరలిస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తూ.. వాహనాల తనిఖీల్లో భాగంగా మండలంలోని మైలగడ్డ శివారులో రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న దేవరాజు, డ్రైవర్ వీరేష్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.



వాతావరణానికి అనుగుణంగా వ్యవసాయం

బిజినేపల్లి: వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయం చేయాలని, సాగులో సుస్థిర, సేంద్రియ వ్యవసాయంతోపాటు పంట మార్పిడి, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ వంటి వివిధ రకాలను వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాలని పాలెం కేవీకే సమన్వయకర్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నాబార్డు ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పాలెం కేవీకేలో వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంపై రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో వివిధ రకాల పద్ధతులను అవలంభించాలని, తదనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నాబార్డు డీడీఎం షణ్ముఖచారి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ఆముదం పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సాంకేతికతను వినియోగించుకోవాలి

బిజినేపల్లి: రైతులకు వ్యవసాయంలో లాభసాటిగా ఉండే వివిధ పంటలలో సాంకేతికతను వినియోగించాలని పాలెం ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ గోవర్ధన్ అన్నారు. మంగళవారం తిమ్మాజీపేట మండలంలోని గొరిట, చేగుంట గ్రామాల్లో జేసీహెచ్- 66 ఆముదం రకం సాగు చేసిన రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో ఆముదం సాగు తక్కువ ఖర్చుతో లాభసాటిగా ఉంటుందని, సాధారణ సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి లాభసాటి ఉంటుందన్నారు. పంటలో చీడపీడల నివారణ కోసం వ్యవసాయ, శాస్త్రవేత్తల సలహాలు తప్పకుండా స్వీకరించి, వాటిని అనుసరించాలన్నారు. శాస్త్రవేత్తలు సుజాత, నళిని, సైదయ్య, ఏఓ కమల్‌కుమార్, ఏఈఓలు రైతులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో దారుణం

- స్నానపుగది నాలాలో మృతశిశువు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి స్నానపుగదిలో మృత శిశువు సోమవారం రాత్రి లభ్యమవగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తు తెలియని వ్యక్తులు ఆస్పత్రి ప్రసూతి వార్డులోని స్నానపుగది నాలాలో శిశువును ఉంచి యధావిధిగా మూత మూశారు. ఓ గర్భిణి బాతురూంకి వెళ్లగా నీరు నిల్వ ఉండటంతో శానిటేషన్ సిబ్బందికి సమస్యను వివరించింది. వారు వచ్చి నాలాను పరిశీలించగా మృతశిశువు కనిపించింది. శిశువు ఆస్పత్రిలో జన్మించిందా లేక బయటి వ్యక్తులు తీసుకొచ్చి పడేశారా అనే విషయాన్ని ఆస్పత్రి వర్గాలు పరిశీలిస్తున్నాయి. ఈ ఘటనపై ఆస్పత్రిఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డా.సూర్యనారాయణ స్పందిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు విచారణకు కమిటీని నియమించామని తెలిపారు. ఆస్పత్రిలోని సీసీ కెమెరాల ఫుటేజీలను సైతం పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంతర్రాష్ట్ర దారిదోపిడీ ముఠా అరెస్టు

- ఆరుగురి రిమాండ్
- నాలుగు రాష్ట్రాల్లో 30 చోరీలు
- టవేరా వాహనం, ఇనుప రాడ్లు సీజ్
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఎస్పీ అపూర్వరావు

వనపర్తి: ఎనిమిది నెలలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ నాలుగు రాష్ట్రాల్లోని 44వ జాతీయ రహదారి సమీపంలో ఉండే గ్రామాల్లో 30 చోరీలకు పాల్పడుతూ.. దారిదోపిడీలు చేసే పార్థి ముఠాను అరెస్టు చేసినట్లు వనపర్తి ఎస్పీ కె. అపూర్వరావు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆమె ఏఎస్పీ షాకీర్ హుస్సేన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అరెస్టు చేసిన నిందితులను విచారణ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. పెబ్బేరు మండలంలోని తోమాలపల్లి శివారులో ఉదయం వాహన తనిఖీలు చేస్తుండగా, జాతీయ రహదారిపై కర్నూల్ వైపు వెళ్తూ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించిన టవేరా వాహనాన్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పరిశీలించగా పార్థి ముఠాకు చెందిన నిందితులు రాజు శంకర్ కాలే, విజయ్ రామకాలే, గణపతి శివాజీ కాలే, సంజీవ్ ఉమ్మజి పవర్, సయ్యామ్ సలీం షేక్, అంబదాస్ రామచంద్ర రనకంటెలు ప్రయాణిస్తున్నట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నామని, విచారణ చేశామని చెప్పారు. మహారాష్ట్రలోని సోలీపూర్ జిల్లా అదంగం (హూడ్గి) ప్రాంతానికి చెందిన పార్థీలుగా గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. వీరు తరచూ విహారయాత్ర, ఆస్పత్రికి వెళ్తున్నామంటూ చెప్పుకుంటూ జాతీయ రహదారులపై చోరీలకు పాల్పడుతారని, ఎనిమిది నెలల నుంచి 30 చోరీలు చేశారని తెలిపారు. వ్యాపార దుకాణాల షట్టర్లను ఎత్తివేసి డబ్బులు, విలువైన వస్తువులను చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ వెల్లడించారు. వీరివెంట కొందరు మహిళలు సైతం ఉంటారని, వారు ఉదయం వేళలో చోరీ చేసేందుకు వ్యాపార దుకాణాల వద్ద రెక్కీ నిర్వహించి పరిస్థితులు తెలుసుకుంటారని, ముఠాకు సమాచారం ఇస్తారని చెప్పారు. వనపర్తి జిల్లా పరిధిలో రెండు ప్రాంతాల్లో వీరు చోరీలకు పాల్పడ్డారన్నారు. 2022 సెప్టెంబర్ 11వ తేదీ అర్ధరాత్రి పెబ్బేరు పట్టణంలోని లక్ష్మీదుర్గ హార్వేస్టర్ షోరూం షట్టర్‌ను ఎత్తి రూ.14వేలు, సమీపంలోని బజాజ్ హోంనీడ్స్ షట్టర్‌ను ఎత్తి రూ.1000, 2022 డిసెంబర్ 4వ తేదీన చిన్నంబావి మండల కేంద్రంలోని మహాలక్ష్మి వైన్స్ షాపు షట్టర్స్‌ను ఎత్తి రూ.9,600 నగదు చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. షట్టర్‌లను ఎత్తేందుకు కావాల్సిన ఇనుప రాడ్లను వాహనంలో వెంటతీసుకుని దారిపొడవునా దోపిడీలు చేస్తూ, నెలల తరబడి బయటి ప్రాంతాల్లో ఉంటామని విచారణలో ఒప్పుకున్నట్లు చెప్పారు. వీరి నుంచి టవేరా వాహనం, ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని తెలిపారు. నగదు రికవరీ కాలేదని, వీరు ఒప్పుకున్న చోరీలకు సంబంధించిన ఆయారాష్ట్రాల పోలీస్‌శాఖ అధికారులకు సమాచారం అందజేశామని పేర్కొన్నారు.



అదుపులోకి తీసుకున్న ముఠా సభ్యులు.. మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు..

వీరిని చాకచక్యంగా పట్టుకోవటం, విచారణ చేసి వివరాలను సేకరించటంలో సీసీఎస్ సీఐ శ్రీనివాస్ ఆచారి, ఎస్‌ఐలు బృశికేశ్, అంజద్, రామస్వామి, శ్రీనివాస్, హెచ్‌సీ తిరుపతిరెడ్డి, పీసీ సమరసింహారెడ్డి, యాంటీ సెల్ మురళి, గోవింద్, రవి, కమాండ్ కంట్రోల్ పీసీ మురళిల విధి నిర్వహణను ఎస్పీ ప్రశంసించారు.

ఎర్రచందనం దొంగల అరెస్టు

అడ్డాకుల: ముత్యాలంపల్లిలో ఎర్రచందనం చెట్లను నరికి దుంగలను ఎత్తుకెళ్లిన దొంగలను పోలీసులు పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను భూత్పూర్ సీఐ రజితారెడ్డి మంగళవారం వెల్లడించారు. ముత్యాలంపల్లికి చెందిన రైతు భాస్కర్‌రెడ్డి తన పొలంలో ఎర్రచందనం చెట్లను పెంచుతున్నాడు. వాటిలో కొన్ని చెట్లు కోత దశకు రాగా గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 4న రాత్రివేళ 9 చెట్లను నరికి వాటి కొమ్మలను వేరు చేసి దుంగలను ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు చెట్లను నరికి వేయడాన్ని గుర్తించిన రైతు అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ విజయ్ కుమార్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం సంగారెడ్డి జిల్లా జహీరా సంఘం మండలం పుర్యానాయక్‌తండాకు చెందిన ముగ్గురు నిందితులు రాథోడ్ రవీందర్, రాథోడ్ శ్రవన్, రాథోడ్ గోపాల్‌లను పట్టుకున్నారు. నిందితులు ఎర్ర చందనం దుంగలను ఖుద్దూస్ అనే వ్యక్తికి రూ.1.05 లక్షలకు విక్రయించినట్లు సీఐ తెలిపారు. వచ్చిన డబ్బులను ముగ్గురు సమానంగా పంచుకోగా వారి నుంచి రూ.75 వేల నగదు, దుంగలను తరలించడానికి ఉపయోగించిన బొలెరోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కాగా మరో నిందితుడు రమేష్, దుంగలను కొనుగోలు చేసిన ఖుద్దూస్ పరారీలో ఉన్నారన్నారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న ఎస్‌ఐ విజయకుమార్, కానిస్టేబుళ్లు వెంకటేష్, వెంకట్‌నాయక్‌ను సీఐ అభినందించారు.



నిందితులతో సీఐ రజితారెడ్డి, ఎస్‌ఐ విజయకుమార్

బాలకృష్ణకు కాపు నేతల అల్టిమేటం

- ఎస్వీఆర్, ఏఎన్ఆర్‌పై వ్యాఖ్యలు అభ్యంతరకరం
- బహిరంగ క్షమాపణకు డిమాండ్

సాక్షి, అమరావతి: టీడీపీ ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వ్యాఖ్యలపై కాపు నేతలు భగ్గుమన్నారు. సినీ దిగ్గజాలైన ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావులను ఉద్దేశించి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బాలకృష్ణ తక్షణం బహిరంగ క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బాలకృష్ణ వ్యాఖ్యలు కాపుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని, ఈ నెల 25లోపు బాలకృష్ణ క్షమాపణ చెప్పాలని కాపునాడు డిమాండ్ చేసింది. క్షమాపణ చెప్పకుంటే బాలకృష్ణను టీడీపీ నుంచి బహిష్కరించాలని, లేకుంటే లోకేశ్ పాదయాత్రను అడ్డుకుంటామని అల్టిమేటం జారీ చేసింది.

జైలుకెళ్లి పరిశీలించి నివేదిక ఇవ్వండి

సాక్షి, హైదరాబాద్: అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి అరెస్ట్ అయి చర్లపల్లి జైలులో ఉన్న బైరి నరేశ్‌కు అధికారులు ఇస్తున్న సౌకర్యాలు.. అతడిని వేరే సెల్‌లోకి మార్చడంపై సాధ్యాసాధ్యాలు.. ప్రస్తుతం అతడిని ఏకాంత గదిలో ఉంచారా.. వంటి వాటి వివరాలపై నివేదిక అందజేయాలని లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. అయ్యప్పస్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై నరేశ్‌ను గత నెలలో పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.ఏకాంత గదిలో నిర్బంధించడంతో తన ఆరోగ్య పరిస్థితి విషమించిందని, దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, నష్టపరిహారం ఇప్పించాలని నరేశ్, అతని సతీమణి సుజాత హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. నరేశ్ విషయంలో చర్లపల్లి జైలు అధికారులు మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడలేదని ప్రభుత్వం తరఫు న్యాయవాది సామల రవీందర్ వాదనలు వినిపించారు. నరేశ్‌కు ప్రాణహాని ఉందని ఇంటెలిజెన్స్ నివేదిక ఇచ్చిందని, జైలులో అతడి రక్షణ కోసం అధికారులు చర్యలు చేపట్టారని వివరించారు. ఇప్పటికే ఆరు ములాఖత్‌లకు అనుమతి ఇచ్చారని, ఇతరులను కలవనీయడం లేదనడంలో వాస్తవం లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. జైలును సందర్శించి అక్కడ పిటిషనర్‌కు ఇస్తున్న వసతులపై నివేదిక ఇచ్చేందుకు జ్యుడీషియల్ అధికారిని నియమిస్తూ విచారణను వాయిదా వేశారు.

ఎందుకీ గగ్గోలు?

- ఇప్పుడు ఎవరి ఇల్లు తగలబడుతోంది?
- వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో మాకంతా తెలుసు
- ఏపీ హైకోర్టు సీజే జస్టిస్ మిశ్రా ధర్మాసనం వ్యాఖ్యలు
- జీవో 1పై ముగిసిన వాదనలు.. తీర్పు రిజర్వ్

సాక్షి, అమరావతి: సంక్రాంతి సెలవుల సందర్భంగా అత్యవసర కేసుల విచారణకు ఏర్పాటైన వెకేషన్ కోర్టులో తాను నిర్దేశించిన రోస్టర్‌కు భిన్నంగా జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని బెంచ్ వ్యవహరించడాన్ని తప్పుబట్టిన ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వెకేషన్ కోర్టులో ఏం జరిగిందో తమకు స్పష్టంగా తెలుసని, అయితే న్యాయ వ్యవస్థ ప్రయోజనాల దృష్ట్యా ఆ విషయాలను బహిర్గతం చేయడం లేదని తెలిపింది. న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందన్న సీజే ధర్మాసనం, ఇంత జరిగిన తరువాత కూడా తాము స్పందించకుంటే భవిష్యత్తులో వచ్చే ప్రధాన న్యాయమూర్తులు ఇలాగే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. పరిపాలనాపరంగా ప్రధాన న్యాయమూర్తి నిర్దేశించిన రోస్టర్‌లో రెండు పేరాలు మార్చారని, తద్వారా ఒరిజినల్ రోస్టర్ మారిందని ధర్మాసనం తెలిపింది. అసలు జీవో 1 విషయంలో ఏదో జరిగిపోతోందని రాజకీయ పార్టీలు ఎందుకు గగ్గోలు పెడుతున్నాయని ప్రశ్నించింది. అంతగా స్పందించేందుకు ఎవరి ఇల్లు తగలబడుతోందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ విధానంపై ఎందుకింత గగ్గోలు పెడుతున్నారని నిలదీసింది. అది ఓ సాధారణ నిర్ణయమని వ్యాఖ్యానించింది. జీవో 1 విషయంలో ఇరుపక్షాల వాదనలు పూర్తైనందున తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. తుది విచారణ జరిపిన నేపథ్యంలో వారంలో తీర్పు వెలువరిస్తామని తెలిపింది.

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవాలా..?

అంతకుముందు సీపీఐ రామకృష్ణ తరఫు న్యాయవాది ఎస్.అశ్వనీ కుమార్ వాదనలు వినిపిస్తూ.. జీవో 1పై విచారణ జరిపే అధికారం వెకేషన్ బెంచ్‌కు ఉందన్నారు. హైకోర్టు నోటిఫికేషన్ ప్రకారం అత్యవసర కేసులను విచారించే విచక్షణాధికారం సీనియర్ వెకేషన్ జడ్జికి ఉందని తెలిపారు. అందులో భాగంగానే వెకేషన్ బెంచ్ జీవో 1పై తమ వ్యాజ్యాన్ని విచారించిందన్నారు. ప్రభుత్వం పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాస్తుంటే చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు. ఇలాంటి జీవో ఒక్కరోజు కూడా మనుగడలో ఉండటానికి వీల్లేదన్నారు. ఈ సమయంలో ధర్మాసనం తీవ్రంగా స్పందిస్తూ.. జీవో ఎమ్మెస్ అయినా, జీవో ఆర్టీ అయినా ప్రభుత్వం తీసుకున్నది సాధారణ నిర్ణయమేనని, దీనిపై రాజకీయ పార్టీలు ఎందుకు గగ్గోలు పెడుతున్నాయని ప్రశ్నించింది.

పరిస్థితులను బట్టే నిర్ణయం..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ ర్యాలీలు, రోడ్‌షోలపై నిషేధించే ఉద్దేశం ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదన్నారు. జీవో 1లో కూడా ఎక్కడా నిషేధం అన్న పదమే లేదన్నారు. సభలు, సమావేశాల కోసం సమర్పించే ప్రతి దరఖాస్తును అప్పటి పరిస్థితుల ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటారని చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే వాటిని నియంత్రించే అధికారం పోలీసులకు ఉందన్నారు. ప్రజల భద్రత ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ప్రజలు తిరిగే పరిస్థితి లేకుండా చేయడం వల్లే కందుకూరు ఘటన జరిగిందన్నారు. జీవో 1 వల్ల వ్యక్తులకు, రాజకీయ పార్టీలు ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. నిబంధనల ప్రకారం పోలీసులకు మార్గనిర్దేశం చేసే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. లోకేశ్ పాదయాత్రకు అనుమతినిచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఓ రాజకీయ పార్టీ ప్రైవేట్ గ్రౌండ్‌లో సభ నిర్వహణకు అనుమతి కోరితే మంజూరు చేశామన్నారు. ప్రతిదీ పరిస్థితులను బట్టి ఉంటుందని తెలిపారు. వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. ఈ దశలో సిద్ధార్థ లూథ్రా మధ్యంతర ఉత్తర్వుల సంగతి ప్రస్తావించగా.. తుది విచారణ చేపట్టామని, వారంలోపు తీర్పు వెలువరిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.


సభకు హాజరైన ప్రజలు

కార్పొరేట్ల కోసమే మోదీ పాలన


సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. అనంతరం సభలో కేటీఆర్ మాట్లాడుతూ దేశాన్ని ఏలిన 14 మంది ప్రధాన మంత్రుల పాలనలో రూ.56 లక్షల కోట్ల అప్పులు ఉంటే.. నరేంద్రమోదీ ఎనిమిదేళ్ల పాలనలో దేశం రూ.వంద లక్షల కోట్లు అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. దేశంలో పుట్టిన ప్రతి బిడ్డపై రూ.1.25 లక్షల అప్పు మోపుతున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. దమ్ముంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు రాష్ట్ర బీజేపీ నేతలు జాతీయ హోదాను ఇప్పించాలని సవాల్ విసిరారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్లు కావస్తున్నా.. కృష్ణాజలాలపై ఏపీ, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ తెంపని అసమర్థత ప్రభుత్వం కేంద్రానిదేనని నిందించారు. ''మహబూబ్‌నగర్‌లో ఈ రోజు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరుగుతుందంట కదా... తెలంగాణకు 500 టీఎంసీల నీటిని ఇవ్వాలనీ, ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లోనే నిధులు కేటాయిస్తూ పాలమూరు-రంగారెడ్డికి జాతీయహోదాను ఇప్పించాలని అక్కడి నుంచి కేంద్రానికి తీర్మానం చేసి పంపండి'' అని సలహా ఇచ్చారు. రాష్ట్ర బీజేపీ నేతలకు వెన్నెముక ఉంటే ఈ పనులు చేయాలని సవాల్ విసిరారు.

ఆదాయం కాదు.. కష్టాలు డబుల్ అయ్యాయి

'మోదీ పాలనలో రైతుల ఆదాయం డబుల్ అయిందని నిన్న ఓ పత్రికలో ప్రధాని ఆర్థిక సలహాదారు ఓ కథనం రాశారు. ఇది ఎంత దుర్మార్గం. ఎవరి ఆదాయాలూ డబుల్ కాలేదు. కష్టాలు, పెట్టుబడులు డబుల్ అయ్యాయి...'' అని కేటీఆర్ అన్నారు. ఒక్క తెలంగాణలో మన పాలనలో రైతులకు ఆరేళ్లలో రూ.65వేల కోట్లు రైతుబంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దని. రైతు బీమా దేశంలో ఎక్కడా లేదు..అని చెప్పారు. బేకార్‌గాళ్లతో మనకు పంచాయితీ ఎందుకనీ కులాల మతాల మధ్య చిచ్చులు పెడుతున్న చిల్లరగాళ్లు ఉన్నారని బీజేపీ నేతలపై మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డిని గెలిపించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, అబ్రహం, కార్పొరేషన్ చైర్మన్లు సాయిచంద్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలిసారిగా సీనియర్ సిటిజన్లకో పార్కు

రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా సీనియర్ సిటిజన్ల కోసం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఓ పార్కు ఏర్పాటు చేయడం అభినందనీయమని మంత్రి కేటీఆర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని 8వ వార్డు సత్యసాయికాలనీలో రూ.80 లక్షలతో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ పార్కును మంత్రి ప్రారంభించి అద్భుతమంటూ కితాబునిచ్చారు. ఈ పార్కును ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని అభినందించారు. పార్కులో ఉన్న ఓ చెట్టుకు విరగ కాసిన చింతకాయలను చూస్తూ భలే కాశాయని కేటీఆర్ ముచ్చట పడ్డారు. అంతలోనే చెట్టు చింతకాయను ఓ ప్రజాప్రతినిధి తీసుకువచ్చి ఇవ్వగా వాటిని తింటూ భలేగా ఉన్నాయంటూ అందరినీ ఊరించారు.



ఎవరితోనైనా పొత్తులకు సిద్ధం

- జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్


వాహనం ముందు పూజలు చేస్తున్న పవన్

మల్యాల/కొడిమ్యాల(చొప్పదండి)/ధర్మపురి: ప్రజాస్వామ్యంలో ఓట్లు చీలవద్దన్నదే తమ అభిమతమని ఇందుకోసం ఎవరితోనైనా పొత్తులకు సిద్ధమని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఎన్ని పార్టీలు ఉన్నా కొత్త నాయకత్వాన్ని స్వాగతిస్తామన్నారు. జగిత్యాల జిల్లాలోని కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. తన ప్రచార రథం వారాహి వాహనానికి అర్చకులతో పూజలు చేయించారు. 32 నృసింహ దివ్యక్షేత్రాల్లో ఒకటైన ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అనుష్టుప్ నృసింహ యాత్ర ప్రారంభించారు. అంతకుముందు కొడిమ్యాలలోని ఓ రిసార్ట్‌లో విలేకరుల సమావేశంలోనూ.. ఆ తర్వాత ముఖ్య కార్యకర్తల సమావేశంలో పవన్ మాట్లాడారు. తెలంగాణలో 7నుంచి 14 లోక్‌సభ స్థానాల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని వెల్లడించారు. యువత రాజకీయాల్లోకి రావాలన్నారు.

పవన్ వాహనానికి పంక్చర్..

కార్యకర్తల సమావేశం అనంతరం ధర్మపురి బయలుదేరి వెళ్తున్న పవన్ కల్యాణ్ వాహనం టైర్ దొంగలమర్రి సమీపంలో పంక్చరైంది. అప్పటికే ట్రాఫిక్ నిలిచిపోవడం, అందులోనే అంబులెన్స్ ఆగిపోవడంతో పవన్ తన వాహనంలోంచి బయటకు వచ్చి అంబులెన్స్ సిబ్బందికి క్షమాపణ చెప్పారు. కాగా, గతంలో కొండగట్టు అంజన్న దర్శనం కోసం వచ్చిన పవన్ ఆలయ అభివృద్ధికి రూ.11 లక్షల విరాళం అందిస్తానని ఇచ్చిన హామీపై పెదవి విప్పలేదు.

పర్యటనలో అపశ్రుతి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెల్గటూర్(ధర్మపురి): పవన్ కల్యాణ్ పర్యటనలో అపశ్రుతి చోటుచేసుకుంది. వెల్గటూర్ మండలం మొక్కట్రావుపేటకు చెందిన కూస రాజ్‌కుమార్, అతడి స్నేహితుడు జక్కుల అంజితో కలిసి ద్విచక్రవాహనంపై పవన్ కల్యాణ్ కాన్వాయ్‌ను అనుసరిస్తూ ముందుకు సాగారు. కాన్వాయ్‌ను ఓవర్ టేక్ చేయాలని ముందుకు వెళ్తుండగా.. కిషన్‌రావుపేట స్టేజీ వద్ద ఏడో నంబరు రాష్ట్ర రహదారిపై ఎదురుగా వస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్, నీలం సాగర్ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొట్టారు. దీంతో అదుపు తప్పిన బైక్ కరీంనగర్ వైపు నుంచి జన్నారం వెళ్తున్న కారును ఢీకొట్టి పడిపోయింది. ఈ ప్రమాదంలో కూస రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. జక్కుల అంజితో పాటు , మరో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న బొలిశెట్టి, సాగర్ కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు.


మత్స్యకళాశాలలో రెండోరోజు శిక్షణ



పెబ్బేరు: మున్సిపాలిటీలోని మత్స్య కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ రైతులకు రెండోరోజు శిక్షణ నిర్వహించారు. మత్స్య శాస్త్ర సాంకేతిక విభాగ సహాయ అధ్యాపకులు డాక్టర్ మోహన్ మాట్లాడుతూ చేపల పెట్టుబడులు విధివిధానాలు, రకాలు, చట్ట వ్యతిరేకంగా చేపలుపట్టడం, రాళ్లు విసరడం, కట్టెలతో కొట్టడం, డైనమెట్ వాడడం, చేపలకు విషం పెట్టడం, విద్యుత్ శక్తితో చేపలను పట్టడడంపై వివరించారు. అలాగే చెరువులో మొత్తం చేపల పట్టడం లాగుడు వలను, నెట్ వలను వాడాలని నిల్వ చేసే చేపల పద్ధతులపై, మిగిలిన చేపలపై వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీను, అనుష, ఓబులేష్, దేవానంద్, మోహన్, రైతులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సమావేశంలో జిల్లా కవులు


భీంపల్లి శ్రీకాంత్


బండారు సునీత

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ఈ నెల 29న నిర్వహిస్తున్న 'తెలుగు సాహిత్య సౌరభం' అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో విశిష్ట అతిథులుగా జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, కవయిత్రి బండారు సునీత పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం తానా నుంచి వీరు ఆహ్వానం అందుకున్నారు. ఆధునిక నూతన కవితా ప్రక్రియ 'మొగ్గలు' గురించి ఈ వేదిక ద్వారా ప్రపంచానికి పరిచయం చేయనున్నారు. ప్రపంచ సాహిత్య వేదికపై 50కిపైగా సాహిత్య ప్రక్రియలు ఒకే వేదికపై పరిచయం చేయడం మునుపెన్నడూ జరగని ఒక విశేష కార్యక్రమం అని, ఇందులో తమకు అవకాశం కల్పించినందుకు తానా అధ్యక్షుడు లావు అంజయ్యచౌదరికి, తానా ప్రపంచ సాహిత్యవేదిక నిర్వాహకులు తోటకూర ప్రసాద్, కన్వీనర్ చిగురుమళ్ల శ్రీనివాస్‌కు జిల్లా కవులు కృతజ్ఞతలు తెలిపారు.

రాచరిక పాలనకు నిదర్శనం

- దళితులు నీ బండి వెంట పరిగెత్తాలా?
- మార్కండేయ ప్రాజెక్టుపై కదలిక కాంగ్రెస్ కార్యకర్తల విజయం
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మోటర్ సైకిల్‌పై కూర్చుంటే దళిత నాయకులు, కార్యకర్తలతో పరుగులు పెట్టించడాన్ని చూస్తుంటే రాచరికపు వ్యవస్థ కళ్లముందు తిరుగుతోందని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. నిజాం తన బండి వెనుక కావడీలను పరిగెత్తించినట్టుగా ఎమ్మెల్యే వ్యవహారం ఉందని దుయ్యబట్టారు. మంగళవారం జిల్లాకేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన పోరాట ఫలితంగానే మార్కండేయ రిజర్వాయర్ పనుల్లో కదలిక వచ్చిందని చెప్పారు. వచ్చే మే నెల చివరి వరకు పూర్తి చేయాలని ఇంజినీర్లు నిర్ణయించారని వెల్లడించారు. మార్కండేయ లిఫ్టు పనులను ఆరు నెలల్లో పూర్తిచేస్తామని గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీనే తాము గుర్తుచేశామన్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రాజెక్టు పూర్తిచేసి ఉంటే నాలుగేళ్ల పాటు రైతులకు నీళ్లు వచ్చి పంటలు పండించుకునే అవకాశం ఉండేదని చెప్పారు. ఇకపై ప్రభుత్వం మరచిపోయిన హామీలన్నీ గుర్తుచేస్తూ పోరాటం చేస్తామని వెల్లడించారు. రేపటి నుంచి మోత చాలా ఉందని, వదిలిపెట్టిన డబుల్ ఇండ్ల నిర్మాణం నుంచే పోరాటం ప్రారంభిస్తామని చెప్పారు. మార్కండేయ పైలాన్ సంప్రోక్షణ పేరుతో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నేతలు పైలాన్‌ను కాళ్లతో తొక్కి అపవిత్రం చేశారని వ్యాఖ్యానించారు. తాను తెచ్చిన కేఎల్ఐ నీటితోనే పైలాన్‌పై 101 బిందెల కృష్ణానీటితో కడిగారని పేర్కొన్నారు. వాల్యానాయక్, రాములుపై బీఆర్ఎస్ నేతల దాడి ఫలితంగానే ఆత్మ గౌరవ సభను నిర్వహించామన్నారు. సభకు వచ్చిన ప్రజల స్పందన చూసిన తర్వాత ప్రభుత్వ పునాదులు కదిలి ఎన్నికల హామీ పూర్తిచేస్తామని చెప్పాల్సి వచ్చిందని వివరించారు. తాను తెల్ల కాగితం లాంటి వాడినని, రాజకీయ జీవితంలో ఏనాడూ అవినీతికి తావు ఇవ్వలేదని చెప్పారు. ఈనెల 26 నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి 'హాత్ సే హాత్ జోడో అభియాన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ కోరారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలపై కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక క్షేత్రం మన్యంకొండ

మహబూబ్‌నగర్ రూరల్: ఆధ్యాత్మిక క్షేత్రం మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం అని కలెక్టర్ వెంకట్రావ్ అన్నారు. బ్రహ్మోత్సవాల నాటికి మహబూబ్‌నగర్- రాయిచూర్ ప్రధాన రహదారిపై ఉన్న కమాన్ నుంచి ఇరువైపులా డబుల్ రోడ్డు, సెంట్రల్ మీడియన్, లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చేనెల 3 నుంచి మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కలెక్టర్ మంగళవారం సాయంత్రం అలివేలుమంగ ఆలయం నుంచి చేపట్టిన ఆయా పనులను తనిఖీ చేశారు. అలాగే కొండపైకి వెళ్లే రహదారిలో శంకు చక్రాల ఏర్పాటు, ప్రధాన రహదారిపై ఉన్న కమాన్‌కు ఆటోమేటిక్ బల్బుల బిగింపుపై దృష్టిసారించాలన్నారు.

వేగవంతంగా భూసేకరణ

ప్రాజెక్టుల కింద చేపట్టి, మిగిలిపోయిన భూసేకరణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతలతోపాటు కోయిల్‌సాగర్, కేఎల్ఐ, చించోలి రహదారి తదితర ప్రాజెక్టుల కింద చేపట్టిన భూసేకరణ, పెండింగ్ పనులు, ఆర్‌అండ్ఆర్ కేంద్రాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఆయా ప్రాజెక్టులు, జాతీయ రహదారి కింద మిగిలిపోయిన భూసేకరణ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చించోలి రహదారి పనులు వేగవంతం చేయాలని, జాతీయ రహదారి సంస్థల అధికారులను ఆదేశించారు. కేఎల్ఐలో భాగంగా మిడ్జిల్ మండలంలోని 4వ డిస్ట్రిబ్యూటరీలో ఉన్న కోర్టు కేసును త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ సీతారామారావు, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ అనిల్‌కుమార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్‌రావు, జాతీయ రహదారుల సంస్థ డీఈ రమేష్, ఆర్అండ్‌బీ డీఈ మురళి, హార్టికల్చర్ ఏడీ సాయిబా పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను సజావుగా జరిపిద్దాం



జడ్చర్ల టౌన్: అన్ని శాఖల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు సజావుగా జరిపిద్దామని మహబూబ్‌నగర్ ఆర్డీఓ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం గంగాపురంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలపై నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతేడాది జరిగిన పొరపాట్లను ఈ పర్యాయం జరగకుండా చూసుకోవాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. భక్తులకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అన్నిచర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, విద్యుత్ సరఫరాలో అటంకం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. డీఎంహెచ్ఓకు సమాచారం అందించి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా బందోబస్తు చేపట్టాలని పోలీసులను, భక్తుల సౌకర్యార్థం తగినన్ని బస్సులు నడిపించాలని, ఆర్టీసీ అధికారులను కోరారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ ఉమాదేవి, ఈఓ శ్రీనివాసరాజు, గోవర్ధన్‌రెడ్డి, సీఐ సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం

ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మేళతాళాల మధ్య ధ్వజస్తంభం వద్ద పతాకావిష్కరణ చేశారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ చేసి బలిహరణం జరిపించారు.

విద్యుత్ చౌర్యం కేసులో రూ.1.24 లక్షల జరిమానా

బాలానగర్: విద్యుత్‌ను అక్రమంగా రెండో సారి ఉపయోగించిన వ్యక్తికి భారీ జరిమానాను మొదటి సెషన్స్ కోర్టు జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు మంగళవారం మండల పరిధిలోని వీరన్నపల్లికి చెందిన వ్యక్తికి విధించాడు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌నగర్ కాశిరెడ్డి, ఎస్ఐ అంజయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాలానగర్ మండల పరిధిలోని వీరన్నపల్లికి చెందిన కటికె నాగరాజు(42) 2017 సంవత్సరంలో అక్రమ విద్యుత్ వాడి పట్టుబడగా.. మొదటి తప్పుగా భావించి అతడికి కొంత జరిమానా వేశారు. అయితే అదే వ్యక్తి తిరిగి అలవాటుగా అక్రమ విద్యుత్ వినియోగం చేస్తూ.. 2018 సంవత్సరంలో విద్యుత్ శాఖ ఉన్నత అధికారులకు పట్టుబడ్డాడు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌కో విజిలెన్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. అప్పట్లో గాంధీ నాయక్ అతడిపై కేసు నమోదు చేసి జుడీషియల్ రిమాండ్‌కు పంపారు. అప్పటి నుంచి వివిధ సాక్ష్యాలను పరిశీలించిన అడిషనల్ ప్రాసిక్యూటర్ ఎస్.మురళీకృష్ణ వాదనలు వినిపించారు. జిల్లా మొదటి సెషన్స్ కోర్టు జడ్జి బోయ శ్రీనివాసులు మంగళవారం కటికె నాగరాజుకు రూ.1,24,506 భారీ జరిమానా విధించినట్లు విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కాశిరెడ్డి, విజిలెన్స్ ఎస్ఐ అంజయ్య, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ నరేందర్ కుమార్, ఏపీటీఎస్‌పీఎస్ తెలంగాణ ట్రాన్స్‌కో మహబూబ్‌నగర్ తెలిపారు. జరిమానా కట్టకుంటే జైలుకు పంపనున్నట్లు తెలియజేశారు.

ఈ అన్నం తినలేం..


రోడ్డుపై నిరసన తెలుపుతున్న విద్యార్థులు

- మధ్యాహ్న భోజనం బాగోలేదని విద్యార్థుల రాస్తారోకో
- పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన

కల్వకుర్తి టౌన్: ఉడికీ ఉడకని అన్నం.. రుచి పచిలేని కూరలు మేం తినలేం అంటూ స్థానిక బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. మధ్యాహ్న భోజనం సరిగ్గా వండడం లేదంటూ మంగళవారం గంటపాటు విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. అన్నం సరిగ్గా ఉడకటం లేదని, ఉడికినా గడ్డలు గడ్డలుగా ఉంటుందని, కూరలు అస్సలు బాగా లేవని పలుమార్లు హెడ్‌మాస్టర్ సర్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని విద్యార్థులు వాపోయారు. పైగా కలెక్టర్‌కు వెళ్లి చెప్పండని లేదా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారని పేర్కొన్నారు. వరుసగా మూడు రోజుల నుంచి అన్నం సరిగ్గా లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగామన్నారు. ఇదిలాఉండగా, రాస్తారోకో చేస్తున్నా హెడ్‌మాస్టర్ బయటకి వచ్చి కనీసం వారికి నచ్చజెప్పే ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. చివరకు స్థానిక ప్రజాప్రతినిధులు, ఏబీవీపీ, బీజేపీ నాయకులు విద్యార్థులకు నచ్చజెప్పి నిరసనను విరమింపచేశారు. నిరసనను విరమింపచేసిన విద్యార్థులు పాఠశాల ఆవరణలోకి వెళ్లి రుచికరమైన కూరగాయలు, ఉడికిన అన్నం వడ్డించాలని నినాదాలు చేశారు. అదేవిధంగా మెనూ ప్రకారం అందించాల్సిన భోజనాన్ని కూడా పెట్టడం లేదని వారు వాపోయారు. చివరకు స్థానిక వైస్ ఎంపీపీ గోవర్దర్ వచ్చి విద్యార్థులకు నచ్చజెప్పటంతో వారంతా నిరసనను విరమించారు. వెంటనే మళ్లీ అన్నాన్ని వండించి విద్యార్థులకు వడ్డించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హెడ్‌మాస్టర్ సర్ధార్ తెలిపారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరు



మధ్యాహ్న భోజనం అధ్వాన్నంగా ఉంది. హెడ్‌మాస్టర్‌కు ఫిర్యాదు చేస్తే మీ ఇష్టం ఉన్న చోట చెప్పుకోండి అని అసభ్య పదజాలాన్ని విద్యార్థులపై వాడతారు. చివరికి రోడ్డుపైకి వచ్చి నిసరన తెలిపాం. మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించేలా చూడాలి.


– రాకేష్, విద్యార్థి

బియ్యం సరిగ్గా లేవు

ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం సరిగ్గా లేకపోవటంతో ఇలాంటి సమస్య ఏర్పడింది. విద్యార్థులపై అసభ్య పదజాలాన్ని వాడాననడం పూర్తిగా అబద్ధం. వంట ఏజెన్సీ వారికి సరిగ్గా వండాలని చెప్పాం. మరోమారు ఇలాంటి సమస్య రాకుండా నాణ్యమైన భోజనాన్ని అందిస్తాం.

– సర్దార్, హెడ్‌మాస్టర్, ప్రభుత్వ పాఠశాల, కల్వకుర్తి

సింగోటం ఆలయ పునర్నిర్మాణంపై సమీక్ష



కొల్లాపూర్: మండలంలోని సింగోటం లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పునర్నిర్మాణంపై ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఆదిత్య లక్ష్మారావుతో కలిసి హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణానికి గతంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరు చేశారు. పనుల ప్రారంభం ఆలస్యమవుతుండటంతో అధికారులతో సమావేశం నిర్వహించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆగమ శాస్త్రం ప్రకారం నిర్మాణ పనులు జరిగేలా చూస్తామన్నారు.